చెట్లను పెకిలించి.. వ్యాపారాలకు తెరలేపి!


రంగారెడ్డినగర్- ఐడీపీఎల్ రోడ్డులో గ్రీనరీ ప్రాంతంలో ఇటుక, కంకర డంపింగ్


టీఎస్ఐఐసీ కాలనీకి ఎదురుగా ఉన్న గ్రీనరీలో కంకర, ఇటుక వ్యాపారాలు


జీడిమెట్ల పారిశ్రామికవాడ రోడ్డులో ఐలా గ్రీనరీలో కట్టెల దుకాణం


షాపూర్‌నగర్ రైతు బజారుకు ఎదురుగా ఐలా ప్రాంతంలో వెలిసిన డబ్బాలు


గ్రీనరీని ఎంచక్కా చదును చూసి వ్యాపారాలు


ఐడీపీఎల్- జగద్గిరిగుట్ట రోడ్డులోని ఐలా స్థలంలో డంప్ చేసిన భవన నిర్మాణ సామగ్రి

రంగారెడ్డినగర్: పారిశ్రామిక ప్రాంతంలో పచ్చదనాన్ని పెంచి పర్యావరణాన్ని పెంపొందించడానికి వదిలిన గ్రీనరీ ప్రాంతాలు కబ్జా చెరలో చిక్కుకున్నాయి. దేశంలోనే అతి పెద్ద పారిశ్రామికవాడల్లో ఒకటైన జీడిమెట్ల, గాంధీనగర్ ప్రాంతాల్లో కాలుష్య నివారణలో భాగంగా గతంలో ఐలా ఆధ్వర్యంలో నర్సాపూర్ రాష్ట్ర రహదారిని ఆనుకుని జీడిమెట్ల నుంచి షాపూర్‌నగర్ వరకు.. అదే విధంగా ఐడీపీఎల్ మొదలుకుని రంగారెడ్డినగర్ ప్రధాన రోడ్డు వరకు పచ్చని చెట్లను నాటారు.

◆ అయితే రాను రాను అధికారులు పట్టించుకోకపోవడంతో కొందరు అక్రమార్కులకు వరంగా మారింది. పచ్చని చెట్లను పెకలించి ఎంచక్కా వ్యాపారాలకు తెరలేపారు. కొందరేమో భవన నిర్మాణ సామగ్రి అయిన ఇసుక, ఇటుక, కంకర వ్యాపారాలు, మరికొందరు పండ్ల దుకాణాలు మొదలుకుని టీస్టాల్స్, కట్టెల దుకాణాలను దర్జాగా నిర్వహిస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఐలా అధికారులు మాత్రం చర్యలు తీసుకోవడంలో చోద్యం చూస్తున్నారు.

◆ ఫిర్యాదులు అందిన సమయంలో, ఏదైనా వార్తా కథనం ప్రచురితమైన సందర్భంలో హడావుడి చేస్తూ ఆపై షరామామూలుగా అక్రమ వ్యాపారాలను చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇదంతా స్థానికంగా ఉండే ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లకు తలొగ్గి పచ్చదనాన్ని హరిస్తున్నా మారు మాట్లాడకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

◆ రోజు రోజుకు పెరిగిపోతున్న ఉష్ణోగ్రతలను అదుపులో ఉంచాలంటే అది పచ్చని చెట్లతోనే సాధ్యమని పర్యావరణ వేత్తలు ఓ వైపు చెబుతున్నా గ్రీనరీని పెంపొందించడంలో అధికారులు అలసత్వాన్ని వీడకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా ఐలా అధికారులు అక్రమణలకు చెక్ పెడతారో.. లేదో వేచి చూద్దాం.

త్వరలో రూ.90 లక్షలతో అభివృద్ధి పనులు

గాజులరామారం ఏఈ తిరుపతి


భూదేవిహిల్స్‌లోని బతుకమ్మకుంట

జగద్గిరిగుట్ట: డివిజన్‌లో త్వరలోఅంతర్గత రోడ్లను రూ.90 లక్షలతో ప్రారంభించనున్నట్లు గాజులరామారం ఏఈ తిరుపతి తెలిపారు. ఇప్పటికే టెండరు ప్రక్రియ పూర్తి అయ్యిందన్నారు. జగద్గిరినగర్‌లో రూ.35లక్షలు, సంజయ్‌పూరి కాలనీలో రూ.30 లక్షలు, కూనా మహాలక్ష్మీనగర్‌లో రూ.25లక్షలతో పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న భూదేవిహిల్స్‌లోని బతుకమ్మకుంట అభివృద్ధి పనులను త్వరలోనే పూర్తి చేస్తామన్నారు.

ఫుట్‌పాత్ వ్యాపారులను ఇబ్బందులు పెట్టొద్దు

జగద్గిరిగుట్ట కార్పొరేటర్ జగన్

జగద్గిరిగుట్ట: పైప్‌లైన్ రోడ్డులోని ఫుట్‌పాత్ వ్యాపారులను ఇబ్బంది పెట్టవద్దని జగద్గిరిగుట్ట కార్పొరేటర్ జగన్ అన్నారు. ఈ విషయమై సోమవారం గాజులరామారం సర్కిల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో డీసీ మల్లయ్యకు వినతి పత్రం అందజేశారు. చిన్నచిన్న వ్యాపారులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఈ వ్యాపారస్తులను రెండు నెలలుగా వస్తువులు, తోపుడు బండ్లను తీసుకెళ్లపోవడంతో కార్పొరేటర్‌ను ఆశ్రయించిచారు. ఈ విషయమై ప్రత్యమ్నాయ ఏర్పాటు చేయాలన్నారు. రోడ్డు విస్తరణ చేసే సమయంలో పూర్తిగా సహకరిస్తారని తెలిపారు. అప్పటి వరకు వీరిని ఇబ్బందులకు గురి చేయవద్దని కార్పొరేటర్ కోరారు. దీనికి డీసీ సానుకూలంగా స్పందించినట్లు కార్పొరేటర్ తెలిపారు.

ఎలక్టోరల్ బాండ్ల వివరాలను వెల్లడించాలి

నిజాంపేట్: ఎలక్టోరల్ బాండ్ల వివరాలను వెల్లడించాలని సుప్రీం కోర్టు ఆదేశించినా మోదీ ప్రభుత్వం బహిర్గతం చేయడం లేదని సీపీఎం మండల కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు. సోమవారం బాచుపల్లిలోని ఎస్‌బీఐ బ్యాంక్ ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. బాండ్ల కొనుగోలు విషయంలో చూపుతున్న గోపత్యపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. మార్చి 6వ తేదీలోగా విషయం తేల్చాలని సుప్రీంకోర్టు ఆదేశించినా కేంద్రం 116 రోజుల గడువు కోరడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ఈ నిరసన కార్యక్రమంలో సీపీఎం నాయకులు కృష్ణ, మాణిక్యం, యాదగిరి, ప్రవీణ్, తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ వ్యవస్థకు మహిళలు దూరం కావొద్దు

జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి.సింధు

రాయదుర్గం: భారతదేశం త్వరలో సాధించాలనుకునే పది ట్రిలియన్ ఆర్థికాభివృద్ధి ముఖ్యంగా మహిళలతోనే సాధ్యమని జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి సింధు పేర్కొన్నారు.సోమవారం గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలోని చాణక్య హాల్‌లో ఏర్పాటు చేసిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఆమెను ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జీ రామేశ్వరరావు ఘనంగా సత్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ వ్యవసాయం, నిర్మాణ రంగం, మ్యానుఫాక్చరింగ్ రంగాలలో ప్రస్తుతం భారత మహిళలు దూసుకుపోతున్నారన్నారు. ఇప్పటికే దేశంలోని ఐటీరంగంలో సగానికి పైగా మహిళలే ఉన్నారన్నారు. ఎన్ని రంగాల్లో అభివృద్ధి సాధించినప్పటికీ కుటుంబ వ్యవస్థకు మహిళలు దూరం కావద్దన్నారు. ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు మాట్లాడుతూ ప్రపంచంలో స్త్రీ, పురుషులు ఇద్దరూ సమానమేనని, స్త్రీ లేనిదే పురుషుడు లేడని, అభివృద్ధిలో ఇద్దరూ సమానమేనన్నారు.కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ పోస్టు గ్రాడ్యుయేట్ స్టడీస్ ప్రిన్సిపల్ డాక్టర్ జగన్‌మోహన్‌రావు, ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రి డాక్టర్ లీల, డాక్టర్ రమణి, కాలేజ్ చీఫ్ లక్ష్మీకాంతరావు ప్రసంగించారు. కార్యక్రమంలో ఎస్కీ అధికారులు, ఉద్యోగులు,విద్యార్థులు పాల్గొన్నారు.

జపాన్‌ను సందర్శించిన హెచ్‌సీయూ పరిశోధక బృందం

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పరిశోధక బృందం జపాన్‌ను సందర్శించింది. హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్‌లోని ప్లాంట్ సైన్స్ విభాగం అధిపతి ప్రొఫెసర్ ఎస్ రాజగోపాల్ నాయకత్వంలోని పరిశోధక బృందం సాకురా సైన్స్ ఎక్స్‌చేంజ్ ప్రోగ్రామ్ అనే ప్రతిష్టాత్మక కార్యక్రమానికి ఎంపికయ్యారు. ఇది జపనీస్ ప్రభుత్వ శాస్త్రీయ విభాగం సహకారాన్ని ప్రోత్సహిస్తుంది. మార్చి 3వ తేదీ నుంచి 10వ తేదీ వరకు జపాన్‌లో పర్యటించి సోమవారం క్యాంపస్‌కు చేరుకున్నారు. ఈ కార్యక్రమాన్ని జపాన్‌లోని ఒకాయామా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ యుచిరో తకాహషి నాయకత్వం వహించారు. హెచ్‌సీయూ ప్రొఫెసర్లు ఎస్ రాజగోపాల్, డాక్టర్ వెంకటేశ్వర రావు, బృందంలోని సభ్యులు పవిత్రా రామచంద్రన్, జ్యోతిరంజన్‌రాత్, పులిమామిడి భరత్, జెరోమ్ జేవియర్, విజయ్ శ్రీనివాస్‌లావుడియా, శ్రియా శర్మ, నమ్రతదూబే, శివ నాగసాయి దామరాజు వారం రోజులపాటు పర్యటించారు. కిరణజన్యసంయోగక్రియ, పరిశోధన, సరిహద్దులను అధిగమించడం, సహకార వృద్ధిని పెంపొందించే పరిశోధనలో పాల్గొన్నారు.

మెట్రో కనెక్టివిటీని మేడ్చల్ వరకు పొడిగించాలి


ఎమ్మెల్సీ కోదండరామ్‌కు వినతి పత్రం ఇస్తున్న మేడ్చల్ మెట్రోరైల్ సాధన సమితి సభ్యులు

కుత్బుల్లాపూర్: మేడ్చల్ మెట్రో రైల్ సాధన సమితి సభ్యులు సోమవారం ఎమ్మెల్సీ కోదండ రామ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రజా రవాణా సదుపాయాలను పెంపొందించే లక్ష్యంతో మెటట్రోరైల్ పనులు చేపట్టడం అభినందనీయమని అన్నారు. మేడ్చల్ వరకు మెట్రో ఫేజ్–2ను పొడిగించేలా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లాలని సమితి కోర్ కమిటీ సభ్యులు సంపత్‌రెడ్డి, ఓరుగంటి వెంకటేశ్వర్లుయాదవ్, జార్జ్, రాజేందర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి వినతి పత్రం అందజేశారు. ఉత్తర హైదరాబాద్‌లో పెరుగుతున్న రవాణ డిమాండ్లను పరిష్కరించడానికి మెట్రోరైల్ సేవలు ఈప్రాంత వాసులకు ఎంతో అవసరమని అన్నారు. ఇప్పటికే సుచిత్ర, కొంపల్లి ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని మెట్రోరైల్ సాధనకు సహకరించాలని కోరారు. దీనిపై స్పందించిన కోదండ రామ్ మెట్రో కనెక్టివిటీని మేడ్చల్ వరకు పొడిగించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ప్రజావాణిలో 8 ఫిర్యాదులు

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం అందజేయడమే ప్రజావాణి ముఖ్య ఉద్దేశమని గాజులరామారం, కుత్బుల్లాపూర్ సర్కిళ్ల ఉపకమిషనర్లు మల్లయ్య, నరసింహ అన్నారు. సోమవారం జంట సర్కిళ్ల పరిధిలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం వరకు ప్రజావాణి జరిగింది. సర్కిళ్ల పరిధిలోని ప్రజలు స్థానికంగా నెలకొన్న సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. గాజులరామారం సర్కిల్ పరిధిలో ఇంజినీరింగ్(01), టాక్స్(02), టౌన్ ప్లానింగ్ (01) మొత్తం 4 అర్జీలు, అదే విధంగా కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో ఇంజినీరింగ్ (01), టాక్స్(01), టౌన్ ప్లానింగ్ (02) వినతి పత్రాలు అందాయన్నారు. సంబంధిత అధికారులు తగు చర్యలు చేపట్టాల్సిందిగా ఉప కమిషనర్లు ఆదేశించారు.


ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కుత్బుల్లాపూర్ ఉపకమిషనర్ నరసింహ

బీజేపీ ప్రభుత్వం హ్యాట్రిక్ సాధించడం ఖాయం

సుభాష్‌నగర్: కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం హ్యాట్రిక్ సాధించడం ఖాయమని బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి అన్నారు. సోమవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా గాజులరామారం నుంచి గండిమైసమ్మ వరకు అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్ ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ... దేశ ప్రజల ఆశయాలను అనుగుణంగా ప్రధాని మోదీ పాలన కొనసాగిస్తున్నారని అన్నారు. ఇండియా కూటమిలో ఎన్ని ప్రతిపక్ష పార్టీలు వచ్చి చేరినా రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ రాష్ట్ర నాయకుడు జేకే శేఖర్‌యాదవ్, కంటెస్టెడ్ కార్పొరేటర్ రాజాసదానందం, జిల్లా ఉపాధ్యక్షులు భవిగడ్డ రవి, శివాజీ రాజా, కంది శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.


జెండా ఊపి బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న బీజేపీ నేత మల్లారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి

కాలనీ అభివృద్ధికి అందరిని కలుపుకుని వెళ్తాం

వెంకటరాయనగర్ అధ్యక్షుడు రవీంద్రారెడ్డి

నిజాంపేట్: నిజాంపేట్ వెంకటరాయనగర్ సంక్షేమ సంఘం నూతన కమిటీ సభ్యులకు సోమవారం అధ్యక్షుడు రవీంద్రారెడ్డి నియామక పత్రాలు అందజేశారు. ఉపాధ్యక్షుడిగా రామకృష్ణ, స్వరూపరావు, కార్యదర్శిగా రాజేష్, కోశాధికారిగా చందుకుమార్, సంయుక్త కార్యదర్శులుగా లక్ష్మణ్‌రావు, అజయ్ ఝా, కన్వీనర్లుగా రమాకాంత్, ఫరూక్‌లను నియమించారు. రాజకీయాలకు అతీతంగా కాలనీ అభివృద్ధిలో అందరిని కలుపుకుని వెళ్తామని నూతన కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత


పీడీఎస్ బియ్యంతో పట్టుబడిన షేక్ అమీర్, షేక్ హాజీ

జగద్గిరిగుట్ట: పీడీఎస్ బియ్యాన్ని రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను బాలానగర్ ఎస్‌ఓటీ పోలీసులు వలపన్ని పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లమ్మబండ జన్మభూమి కాలనీకి చెందిన షేక్ అమీర్(24), షేక్ హాజీ(27) స్థానికంగా ఉండే ఇళ్లకు ప్రతి నెలా తిరుగుతూ ప్రజల నుంచి పీడీఎస్ రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి అదే బస్తీలో నివాసముండే సయ్యద్ ఫజిల్(41) గోదాంలో నిల్వ ఉంచుతున్నాడు. ఆ తర్వాత జహీరాబాద్‌కు చెందిన విక్కీ అనే వ్యక్తికి ఎక్కువ ధరకు విక్రయిస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. దీనిపై సమాచారం అందుకున్న బాలానగర్ ఎస్‌ఓటీ, జగద్గిరిగుట్ట పోలీసులు సోమవారం ఎల్లమ్మబండ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు.

◆ ఈ నేపథ్యంలో (టీఎస్ 09జీపీ టీఆర్ 0568) టీవీఎస్ వాహనంపై వచ్చిన అమీర్, హాజీలను ఆపి సోదాలు చేయగా బియ్యంతో పాటు వేయింగ్ మెషిన్లు పట్టుబడ్డాయి. వీరిని అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో ప్రశ్నించగా తాము బియ్యాన్ని భద్రపరిచే గోదాం వివరాలు బయట పెట్టారు. అక్కడికి వెళ్లి చూడగా 460 కిలోల రేషన్ బియ్యం బస్తాలు లభ్యమయ్యాయి. కాగా గోదాం నిర్వాహకుడు ఫజిల్, కొనుగోలుదారుడు విక్కీ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఇరువురిపై జగద్గిరిగుట్ట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుత్బుల్లాపూర్ సర్వేయర్‌గా శ్రీనివాస్



సుభాష్‌నగర్: కుత్బుల్లాపూర్ రెవెన్యూ సర్వేయర్ శ్రీనివాస్ సోమవారం కొత్తగా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన సర్వేయర్ జగదీశ్వర్ కాప్రాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కీసరలో పనిచేస్తున్న శ్రీనివాస్ కుత్బుల్లాపూర్‌కు వచ్చారు.

రవితేజకు జ్యోతిష్య వాస్తురత్న అవార్డు


అవార్డుతో రవితేజ

జగద్గిరిగుట్ట: బాల్‌రెడ్డినగర్‌కు చెందిన మడుపాటి రవితేజకు జ్యోతిష్య వాస్తురత్న అవార్డు అభించింది. ఎస్ఎలైవ్ ఆస్ట్రో ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో గత నెల కూకట్‌పల్లిలో జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదివారం శ్రీపొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో అవార్డు అందుకున్నారు. తన ప్రతిభను గుర్తించి అవార్డు ఇచ్చినందుకు ఎస్ఎస్‌లైవ్ ఆస్ట్రో ప్రైవేట్ లిమిటెడ్ వారికి ధన్యవాదాలు తెలిపారు.

హెచ్ఐవీ నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన


సమావేశంలో పాల్గొన్న కళాశాల ప్రతినిధులు

దుండిగల్: దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో హెచ్ఐవీ నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జేఎన్‌టీయూ జాతీయ సేవా పథకం సంయుక్త ఆధ్వర్యంలో 'హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధి నిర్మూలన అవగాహన సదస్సు'జరిగింది. ఈ కార్యక్రమానికి కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్ రెడ్డి, రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ అడిషనల్ డైరెక్టర్ పి.ప్రసాద్, కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ డీన్ ప్రొఫెసర్ నరసింహారావులు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఎయిడ్స్ వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కల్పించడం ఎంతో అవసరమన్నారు. ఇది అంటు వ్యాధి కాదని, అలాగే ఎయిడ్స్ నిర్మూలనకు విద్యార్థులు ప్రజలందరికీ అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఐసీటీసీ సూపర్‌వైజర్ నాగరాజు, ఎంఎల్ఆర్ఐటీ డీన్ డాక్టర్ వి.రాధికాదేవి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నాయిని ఉదయ్ రంజన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఐకమత్యంతో హక్కులు సాధించుకోవాలి


కార్యక్రమంలో స్వర్ణ మహిళా మండలి సభ్యులు

జీడిమెట్ల: మహిళలు ఐకమత్యంతో ఉండి తమ హక్కులు సాధించుకోవాలని బీఆర్ఎస్ నాయకులు మాజీ కార్పొరేటర్ గుడిమెట్ల సురేష్ రెడ్డి అన్నారు. ఆదివారం ఎస్ఆర్ నాయక్ నగర్‌లో స్వర్ణ మహిళా మండలి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సురేష్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహిళలు ఉన్నతంగా ఎదిగితే కుటుంబం అన్ని విధాలుగా ఎదుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఆటల పోటీలలో గెలిచిన మహిళలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాగశిరోమణి, ఉదయకుమారి, కృష్ణకుమారి, మంజులారెడ్డి, వరలక్ష్మి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర ముఠా సభ్యులకు రెండేళ్ల జైలు

జీడిమెట్ల: తుపాకులు, కత్తులతో నగర దుకాణంలో దొంగతనానికి ప్లాన్ వేసిన అంతర్రాష్ట్ర ముఠా సభ్యులకు మేడ్చల్ కోర్టు రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధించింది. అడిషనల్ పీపీ కృష్ణమూర్తి వివరాల ప్రకారం.. 2023వ సంవత్సరం ఏప్రిల్ 11న ఐదుగురు అంతరాష్ట్ర ముఠా సభ్యులు ఆయుధాలు కలిగి ఏపీఐఐసీ కాలనీలోని ఓ ఇంట్లో ఉన్నట్లు జీడిమెట్ల పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందించింది.

◆ అదేరోజు రాత్రి అప్పటి ఇన్‌స్పెక్టర్ పవన్, ఎస్సైలు, కానిస్టేబుళ్లు ముఠా సభ్యులు ఉన్న ఇంటిని చుట్టుముట్టి వారిని చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి తుపాకులు, బుల్లెట్లు, కత్తులు, మంకీక్యాప్స్, స్వాధీనం చేసుకుని మహారాష్ట్రకు చెందిన ఏ1. జీత్ రాజ్‌పాల్(26), ఏ2. అమర్‌సింగ్(22), ఏ3.లక్కీ సింగ్ అలియాస్ గబ్బర్‌సింగ్(20), ఏ4.జువైనల్ హోం, ఏ5.నిషాంత్ నానావర(23)లను అదుపులోకి తీసుకున్నారు. వారిపై 399, 400, 25(ఏ1), (బి1)ల కింద కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు.ఈ కేసులో తుది తీర్పును పైన పేర్కొన్న విధంగా మేడ్చల్ కోర్టు సోమవారం వెల్లడించింది.

తెల్ల రేషన్‌కార్డు ఉన్నా జీరో బిల్ రాలేదు!


గతంలో దరఖాస్తు చేసిన రసీదు చూపిస్తూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మహిళలు

జీరో కరెంట్ బిల్లు రాలేదంటూ వందల సంఖ్యలో దరఖాస్తుదారులు వార్డు కార్యాలయాల వద్ద క్యూ కట్టారు. మా ఇంటి పక్కన ఉన్న వారికి జీరో బిల్లు వచ్చింది. మాకు కూడా వైట్ రేషన్ కార్డు ఉంది. మాకెందుకు రాలేదంటూ వందల సంఖ్యలో మహిళలు గగ్గోలు పెడుతున్నారు. సోమవారం నియోజకవర్గంలోని 8 డివిజన్లలోని వార్డు కార్యాలయాల వద్దకు దరఖాస్తుదారులు పెద్ద ఎత్తున చేరుకుని సిబ్బందిని నిలదీశారు.

సుభాష్‌నగర్: తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రకటించడంతో ప్రజలు ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్నారు. ఆరు గ్యారంటీలలో ఒకటైన గృహజ్యోతి పథకం అమలులోకి రావడంతో మార్చి నెలలో కొంతమందికి జీరో కరెంట్ బిల్లు వచ్చింది. చాలా మంది జీరో రాకపోవడంతో ఆందోళనకు గురయ్యారు. ప్రభుత్వం తెలిపినట్లు తెల్లరేషన్‌కార్డు లేని వారికి కూడా గృహజ్యోతికి అర్హులన్నారు. తమ వద్ద తెల్ల రేషన్‌కార్డు ఉన్నా జీరో బిల్లు ఎందుకు రాలేదని వార్డు కార్యాలయంలోని సిబ్బందిని నిలదీశారు.


గంటల తరబడి ఎండలోనే...

◆ సూరారం డివిజన్ నెహ్రూనగర్ వార్డు కార్యాలయానికి సోమవారం పెద్ద ఎత్తున దరఖాస్తు దారులు చేరుకున్నారు. గంటల తరబడి ఎండలో నిలబడి తమ దరఖాస్తును సమర్పించారు. ఒకరే ఆపరేటర్ ఉండడంతో ఎండలో మహిళలు ఇబ్బందులు పడ్డారు. సమయం అయిపోవడంతో చాలా మంది మహిళలు వెనుదిరిగారు. ఇలా గత రెండు రోజుల నుంచి లైన్‌లో నిలబడిన సమయం అయిపోయిందని తమ దరఖాస్తులను స్వీకరించలేదని చాలామంది మహిళలు వాపోయారు.

తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్న దరఖాస్తుదారులు


ముందుగా గాజులరామారంలోని కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయానికి క్యూ కట్టారు. ఉదయం నుంచి దరఖాస్తుదారుల తాకిడి పెరగడంతో వారికి సమాధానం చెప్పలేక సిబ్బంది అక్కడ అధికారులు తలలు పట్టుకున్నారు. చివరకు గృహజ్యోతికి సంబంధించిన దరఖాస్తు తాము తీసుకోమని వార్డు కార్యాలయానికి వెళ్లాలంటూ కార్యాలయం ఆవరణలో పలుచోట్ల పోస్టర్ అతికించడంతో దరఖాస్తుదారులు వెనుదిరిగారు.

మూడు రోజులుగా తిరుగుతున్నా..



దరఖాస్తు చేసుకుంటే ఉచిత కరెంట్ వస్తదని చెప్పారు. మా ఇంటి పక్క వాళ్లకు ఈనెల కరెంట్ జీరో బిల్లు వచ్చింది. కానీ మాకు మాత్రం 400 మీద బిల్లు వచ్చింది. మాకు వైట్ రేషన్ కార్డు ఉన్నా ఎందుకు కరెంట్ బిల్లు వస్తుంది. మూడు రోజులుగా దరఖాస్తు చేసుకోడానికి వస్తున్నా పని అయితలేదు. – స్వరూప, మార్కండేయనగర్

కనీస ఏర్పాట్లు లేవు...



మాకు వైట్ రేషన్ కార్డు ఉంది. ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్నా. ఈనెల బిల్లు వచ్చింది. వార్డు కార్యాలయానికి దరఖాస్తు కోసం రెండు రోజులుగా వస్తున్నా.. నా లైను వచ్చేసరికి సమయం అయిపోయిందంటూ మూసివేశారు. ఎండలో నిలబడుతున్నాం. తాగడానికి కనీసం నీళ్లు లేవు. అధికారులు స్పందించి తొందరగా దరఖాస్తులు తీసుకోవాలి. – స్వర్ణలత మార్కండేయనగర్